సాక్షి
వికారాబాద్

శనివారం । 3 । ఆగస్టు । 2024



ఎట్టకేలకు మోక్షం

ఏడేళ్లుగా కొనసాగుతోన్న వంతెన నిర్మాణ పనులకు శుక్రవారం మొదటి స్లాబ్ వడింది. 10లో▸



'స్మార్ట్'గా దోచేస్తారు!

సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వీరు ఆన్‌లైన్‌లో దోపిడీకి పాల్పడుతున్నారు. 10లో▸



ఆస్పత్రి లేదు..

50వేల జనాభా ఉన్న దుద్యాల్‌లో సర్కారు దవాఖాన లేదు. ఇక్కడ ప్రాథమిక చికిత్స కూడా అందని దుస్థితి. 11లో▸

న్యూస్‌రీల్

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్

కుల్కచర్ల: గిరిజన ఆశ్రమ పాఠశాలలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లోనూ పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులను నియమించాలని.. విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించేందుకు ట్యూటర్స్‌ను నియమించాలని కోరారు. ప్రస్తుతం బోధిస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వెయిటేజీనిస్తూ పరీక్షలు పెట్టి ఎంపికలు నిర్వహించాలని సూచించారు.

రేపు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక

తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు

తాండూరు టౌన్: పట్టణ శివారులోని పాత శాలివాహన కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 9గంటలకు పరుపందెం క్రీడాకారులకు సెలక్షన్స్ ఉంటాయని తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, కార్యదర్శి రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు సెలక్షన్స్ ఉంటాయన్నారు. సెలక్షన్స్ హాజరయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7న నిర్వహించనున్న 3వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మరింత సమాచారం కోసం 6300075229, 8978234447 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముస్కాన్-10లో 173 మందికి విముక్తి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ఆపరేషన్ ముస్కాన్-10లో 173 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామని ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సబ్ డివిజన్‌ల వారీగా మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జూలై 1 నుంచి 31 వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ఆపరేషన్‌లో 151 మంది బాలురు, 22 మంది బాలికలకు విముక్తి కల్పించామన్నారు. వీరిలో 31 మంది పొరుగు రాష్ట్రాలకు చెందిన వారున్నారని వివరించారు. బాలలను పనిలో పెట్టుకున్నందుకుగాను 15 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. బాలల హక్కులు కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్-10లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ధరణి పోర్టల్‌లో మార్పులు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: ధరణి పోర్టల్ పేరుతో గత ప్రభుత్వంలోని పెద్ద లు పేదల భూముల ను కాజేశారని, ఈ పోర్టల్‌ను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో ఉన్న తప్పిదాలతో ఎంతో మంది రైతులు అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. భూములు అమ్మిన వారి పేర్లు కూడా ప్రస్తుతం పోర్టల్‌లో చూపిస్తుండటంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, రికార్డుల్లో మార్పుల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. చాలా గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు సైతం పట్టాదారుల పేర్లు ధరణిలో కనిపిస్తున్నాయన్నారు. గతంలో భూ సమస్యలు రచ్చ బండల వద్దే పరిష్కారమయ్యేవని గుర్తు చేశారు. ఈ పోర్టల్‌లో మార్పు లు చేర్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

గడ్డిఅన్నారం ఉన్నత శ్రేణి కార్యదర్శిగా శ్రీనివాస్

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బాటసింగారంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా లోకిని శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన చిలుక నర్సింహారెడ్డి హైదరాబాద్ మార్కెట్ (మలకపేట మహబూబ్ మాన్షన్) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బోయినపల్లి, పటాన్‌చెరువు మార్కెట్ల కార్యదర్శిగా పనిచేస్తున్న లోకిని శ్రీనివాస్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా చిలుక నర్సింహారెడ్డి నుంచి లోకిని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

రుణమాఫీ 40%

క్రాప్‌లోన్ తీసుకున్న రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో ఆనందంలో మునిగిపోయారు. కానీ అనంతరం పెట్టిన నిబంధనలు.. బ్యాంకుల కొర్రీలతో సతమవుతున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రుణమాఫీ సొమ్ము విడుదలైనా 40శాతానికి మించి రైతులకు లబ్ధిచేకూరలేదు.

సగానిపైగా పెండింగ్‌లోనే..

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- హెల్ప్ డెస్క్‌కు ఇప్పటికే 1,900 ఫిర్యాదులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రుణమాఫీ కాని రైతులు

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రుణమాఫీ పథకంలో గత ప్రభుత్వాలు చేసిన పాపం నేడు రైతన్నల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ నిబంధనలు సగం మంది రైతులను రుణమాఫీకి దూరం చేస్తే.. బ్యాంకర్లు విధిస్తున్న కొర్రీలు రైతులను ఆవేదనకు గురి చేస్తున్నారు. రుణమాఫీ విషయంలో అపోహలు, అనుమానాలు, నివృత్తి చేయడం, రుణమాఫీ వర్తించని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్‌డెస్క్‌కు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. శుక్రవారం సైతం ఎంతో మంది రైతులు రుణమాఫీకి సంబంధించి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో రూ.1.50లక్షల లోపు ఉన్న రుణాలు మాఫీ చేసిన విషయం విదితమే. జూలై 18న మొదటి విడత రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయగా.. 12 రోజులకు జూలై 30న రెండో విడత డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆగస్టు 15లోగా మొత్తం రుణమాఫీ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ రెండు విడతల తరువాత కూడా ప్రభుత్వం విధించిన పరిమితి లోపు రుణాలున్నవారికి సైతం అనేక మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు.

రుణమాఫీ వివరాలు

రుణమాఫీ	రైతులు	మాఫీ రూ.కోట్లలో
రూ.లక్షలోపు	46,633	రూ.256.26
రూ.1.50లక్షల లోపు	26,438	రూ.262.64
మొత్తం	73,071	రూ.518.9

వెల్లువలా ఫిర్యాదులు

రెండు విడతల రుణమాఫీ అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు రైతుల నుంచి ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా మండలాల నుంచి 1,900 మంది రైతులు ఫిర్యాదులు సమర్పించారు. మరో వైపు రుణమాఫీలో ఎదురవుతున్న అనుమానాలపై నివృత్తి చేసుకునేందుకు రైతులు రోజుకు సగటున 500పైచిలుకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. రుణమాఫీ వర్తించని రైతుల్లో కొందరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు ఫోన్ చేసి క్లారిటీ తీసుకుంటున్నారు. ఫిర్యాదుల్లో ప్రధానంగా రెండు రకాల ఫిర్యాదులున్నాయి. చాలా మంది రైతు కుటుంబాలకు రేషన్ కార్డులు లేకపోవడం.. రైతుల ఆధార్ కార్డులు సరిపోలకపోవడంతోనూ రుణమాఫీ వర్తించలేదు. దీంతో వేల సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు.

వడ్డీ చెల్లిస్తేనే రెన్యూవల్

జిల్లాలో మొత్తం 5.90 లక్షల సాగు భూమి ఉండగా 2.50లక్షల మంది రైతులున్నారు. ఇందులో ప్రతీ ఏట సగటున 1.7 లక్షల నుంచి 1.8 లక్షల మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకుంటున్నారు. ఈ రైతులు ప్రతీ ఏట సగటున రూ.1,800 కోట్ల వరకు పంట రుణాలు తీసుకుంటున్నారు. రెండు విడతల్లో కలిపి మొత్తం రైతుల్లో 40 శాతం మంది రైతులకే లబ్ధి చేకూరింది. అయితే ప్రభుత్వం చేసిన రుణమాఫీకి సంబంధించి పలు విషయాల్లో ఇంకా క్లారిటీ రావడం లేదు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విధించిన కట్ ఆఫ్ డేట్ తరువాత రైతుల రుణా లకు అయిన వడ్డీ చెల్లిస్తేనే మళ్లీ రుణాలు రెన్యూవల్ చేస్తామని బ్యాంకర్లు తెగేసి చెబుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అధికారులదే బాధ్యత

- 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై కలెక్టర్ అవగాహన సమావేశం
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు

అనంతగిరి: ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం అమలు బాధ్యత అధికారుదే అన్నారు. ఆగస్టు 5నుంచి 9వరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్వాడీలు,వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, బస్ స్టాప్‌లలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తెలిపారు. గ్రామాల రహదారులకు స్వాగతం, ధన్యవాదాలు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలని చెప్పారు. మురుగు కాల్వలు, నీరు నిలిచిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. విష జ్వరాలను గుర్తించి అవసరమైన చికిత్సలను అందించాలని వైద్యాధికారులకు సూచించారు. వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గృహ వ్యర్థాలను సేకరించి కంపోస్ట్ ఎరువును ఉత్పత్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధికుక్కలకు సంతానోత్పత్తికి అవకాశం లేకుండా శస్త్రచికిత్సలు చేయించాలన్నారు.

వ్యాసరచన, పద్య గేయ పోటీలు

'స్వచ్ఛదనం-పచ్చదనం'పై 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు వ్యాస రచన, పద్య గేయాల్లో పోటీలు నిర్వహించి మొదటి, రెండవ బహుమతుల కింద నగదు పారితోషికం ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గోడలపై పెయింటింగ్ పనులు చేపట్టాలని సూచించారు.

నూతన పార్కులకు శ్రీకారం

లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో ప్రణాళిక బద్ధంగా వనమహోత్సవాన్ని విజయవంతంగా చేపట్టాలన్నారు. నూతన పార్కులకు శ్రీకారం చుట్టి సుందరీకరించాలని చెప్పారు. ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, డీఈఓ రేణుకాదేవి, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, పశు సంవర్ధక శాఖ అధి కారి పూర్ణచంద్రారావు, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుపై కదలిక

- సీఎం ఆదేశాలతో ప్రక్రియ మరూ
- ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు
- ప్రయత్నాలు సాగిస్తున్న ఆశావహులు
- గ్రామాల్లో మొదలైన రాజకీయ వేడి



షాద్‌నగర్: పంచాయతీ ఎన్నికలపై ఆరు నెలల తర్వాత కదలిక వచ్చింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైంది. పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే ప్రత్యేక అధికారులు పల్లెలకు సరిగా వెళ్లకపోవడం.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

నిలిచిన కేంద్రం నిధులు

పల్లెల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీకి నిధులు మంజూరు చేస్తుంది. నిర్ణీత గడువులోపు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు, మరమ్మతులు, చిన్నా చితక పనులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కేంద్రం నుంచే వచ్చే నిధులు కూడా నిలిచిపోవడంతో సమస్యలు తీవ్రం అవుతున్నాయి.

ఓటరు జాబితాకు ఆదేశాలు

ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకం. గ్రామాలు, వార్డుల వారీగా జాబితాను తయారు చేయాల్సి ఉంటుంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఆగస్టు మొదటి వారంలోపు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సీఎం ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గ్రామాల్లో వార్డు మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీ కోసం కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేసి వారికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా లేక రిజర్వేషన్లు మారుస్తుందా అనే సందిగ్ధం నెలకొంది.

ఆకట్టుకునేలా ఆశావహుల ప్రయత్నాలు

ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గుచూపడం, ఆదిశగా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతుండటంతో పల్లెల్లో రాజకీయ వేడి మొదలైంది. ఆశావహులు ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. రాజకీయ ఎత్తులు వేస్తూ ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

మృత్యు వేగం

- ఫ్లైఓవర్‌ను ఢీకొట్టిన కారు
- నుజ్జునుజ్జయిన వాహనం
- బీబీఏ విద్యార్థి దుర్మరణం
- రాయదుర్గం పరిధిలో దుర్ఘటన



నుజ్జునుజ్జయిన కారు

రాయదుర్గం: మితిమీరిన వేగంతో కారును నడిపిన బీబీఏ విద్యార్థి అసువులు బాశాడు. కారు వేగం నియంత్రణలోకి రాకపోవడంతో ఎడమవైపు టర్న్ కాకుండా ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌ను ఢీకొని అతడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున రాయదుర్గం పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న చెప్పిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడలోని రహమత్ నగర్‌కు చెందిన గోవుల చరణ్ (19) తల్లి చనిపోవడంతో తాత, మేనమామతో కలిసి ఉంటున్నాడు. శంకర్‌పల్లిలోని ఐబీఎస్ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇప్పుడే వస్తానంటూ షిఫ్ట్ డిజైర్ కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. బీఎస్ఆర్ హిల్స్ నుంచి టోలిచౌకీ వైపు వెళుతూ రాయదుర్గం కూడలిలోకి వచ్చాడు. అప్పుడు తెల్లవారుజాము 3.52 గంటలు అవుతోంది. ఆ సమయంలో కారు మితిమీరిన వేగంతో అదుపుతప్పింది. ఎడమ వైపు మళ్లకుండా ఎదురుగా ఉన్న రాయదుర్గం ఫ్లైఓవర్‌ను ఢీకొట్టింది. 70 శాతానిపైగా నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న చరణ్ తీవ్ర గాయాలతో కారులోనే మృతి చెందాడు.



చరణ్ (ఫైల్)



కారులో చరణ్ మృతదేహం

కారు ముందు భాగం ముద్దగా మారిన పరిస్థితి చూస్తే దాని వేగం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులోని చరణ్ మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే మాట మారుస్తారా?

- పర్యావరణవేత్త కవుల సరస్వతి

యాచారం: కాంగ్రెస్ నేతలు అధికారంలో లేనప్పుడు ఫార్మాసిటీ వద్దే వద్దు అని, సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని, బీఆర్ఎస్ సర్కార్‌లో టీఎస్ఐఐసీ మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను మళ్లీ రైతుల పేర్ల మీద మార్చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తున్నారని పర్యావరణ వేత్త కవుల సరస్వతి విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ భూ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి, సీఎం కాగానే వారిని దగ్గరకు కూడా రానీయకుండా అరెస్టులు చేయిస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి భూసేకరణ చేసే గ్రామాల్లో పర్యటించిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తదితరులు అధికారంలోకి వస్తే ఫార్మాసిటీనే రద్దు చేసి తిరిగి ఆ భూములను రైతులకే ఇచ్చేలా కృషి చేస్తామని చెప్పిన మాటలు గుర్తుకు లేవా అని ప్రశ్నించారు. ఓ వైపు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటిస్తూనే మరోవైపు మళ్లీ ప్రజాభిప్రాయం లేకుండానే కొత్త పరిశ్రమలకు భూములు కేటాయించడం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసిన రైతులకు చెందిన 2,500 ఎకరాల పట్టా భూములను తిరిగి వారి పేర్ల మీద మార్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే మరో ఉద్యమం తప్పదని ఆమె హెచ్చరించారు. సమావేశంలో రైతులు శ్రీకాంత్‌నాయక్, నారాయణ పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై టీజీఐఐసీ కసరత్తు

ఫ్యూచర్ సిటీలో వివిధ రంగాలకు కేటాయించే భూముల వివరాలు..

రంగం	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఏఐ సిటీ	297
విద్య, విశ్వవిద్యాలయాల జోన్	454
ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమలు	4,774
వినోద, ఇతర అవసరాలకు	470
ఫర్నిచర్ పార్కు	309
హెల్త్‌సిటీ	370
లైఫ్ సైన్సెస్ హబ్	4,207
రెసిడెన్షియల్ అండ్ మిక్స్‌డ్ యూజ్	1317
నివాస ప్రాంతం	1013
స్పోర్ట్స్ హబ్	761



- 14 వేల ఎకరాల్లో భూ వినియోగంపై స్పష్టత
- సంస్థల వారీగా భూ కేటాయింపుల వర్గీకరణ

నయా నగరి.. మహా దారి!



సాక్షి, రంగారెడ్డి జిల్లా: నయా నగరి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం మహా ప్రణాళిక అమలు చేస్తోంది. రెండ్రోజుల క్రితం పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సర్కారు.. తాజాగా ఆ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. సుమారు 14 వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రంగాలకు కేటాయించాల్సిన భూములను వర్గీకరించింది. ఈ మేరకు తయారు చేసిన మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఔషధనగరి స్థానంలో విశ్వనగరి పురుడు పోసుకోనుంది. నగర శివార్లలోని కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో ప్రతిపాదించిన ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం 19,333 ఎకరాలను సేకరించింది. ఇందులో ఇప్పటివరకు సుమారు 14 వేల ఎకరాలను స్వాధీనం చేసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసి.. దాని స్థానంలో మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా గురువారం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నైపుణాభివృద్ధి విశ్వవిద్యాలయం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంకురార్పణ చేసి భవిష్యత్ సిటీకి పునాది రాయి వేశారు.

13,972 ఎకరాల్లో భవ్య నగరం..

- భవ్య నగరాన్ని 13,972 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త సిటీలో కొలువుదీరే రంగాలకు కేటాయించే భూమిని నిర్దేశిస్తూ తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ) మాస్టర్‌ప్లాన్ రూపొందించింది. ఇందులో ఏఐ (కృత్రిమ మేధ), హెల్త్ సిటీ, ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమలు, ఫర్నిచర్ పార్కు, లైఫ్ సైన్సెస్ హబ్, స్పోర్ట్స్ హబ్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని నిర్ణయించింది.
- ఏఐ సిటీకి సంబంధించి వచ్చే నెలలో భూమి పూజ చేయనుండగా.. ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుపై ఇప్పటికే జపాన్‌కు చెందిన సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే ఈ ప్రాంతానికి చేరువలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమైన యాపిల్ ఉపకరణాల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌కు మరో 2 వేల ఎకరాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ఇటీవల లేఖ రాసింది.
- మరోవైపు స్పోర్ట్స్ హబ్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు బీసీసీఐ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇదే విషయాన్ని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పెట్టుబడులను సులువుగా ఆకర్షించవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఎయిర్‌పోర్టు, జాతీయ రహదారి అందుబాటులో ఉండటం కలిసొచ్చే అంశంగా భావిస్తున్న సర్కారు.. మెట్రో రైలును కూడా ఇక్కడి వరకు పొడిగించేందుకు అలైన్‌మెంట్ మారుస్తోంది.

క్లుప్తంగా

రుణమాఫీ నిధులు జమ

సహకార సంఘం చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి



పెద్దేముల్‌: ప్రభుత్వం రూ.1.50లక్షలోపు చేసిన రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని పెద్దేముల్‌ రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌ దావ్యరి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంఘంలో 516 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని.. ఇప్పటి వరకు రూ.లక్షలోపు రుణం ఉన్న 228 మంది రైతుల ఖాతాల్లో రూ.1.43 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మరో 197 మంది రైతుల రుణ మాఫీ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు.

పశుసంవర్ధకశాఖ ఏడీగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌

తాండూరు రూరల్‌: పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఏడీగా డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఏడీ ప్రభురాజ్‌ మేడ్చల్‌ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నారాయణగూడ్‌ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఏడీ ప్రవీణ్‌కుమార్‌ తాండూరుకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

భూ సర్వేతో హద్దుల ఏర్పాటు



భూ సర్వే వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి

పెద్దేముల్‌: మండల పరిధిలోని కందనెల్లి తండాలో కొనసాగుతున్న భూ సర్వేకు ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి హాజరై పరిశీలించారు. తహసీల్దార్‌ కిషన్‌, సర్వేయర్‌ శ్రీహరితో హద్దుల గుర్తింపు, ఏర్పాటు తదితర వివరాలను ఉమా హారతికి వివరించారు. మూడో రోజు కూడా తండాకు చెందిన రైతు రవి పొలంలో సర్వే మిషన్‌ సాయంతో హద్దులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్‌ కిషన్‌ వివరించారు. ఈ సర్వేలో సర్వేయర్లు శ్రీహరి, నసీర్‌, రెవెన్యూ సిబ్బంది మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తాం

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్‌ స్వప్న

తాండూరు టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న అన్నారు. శుక్రవారం ఆమె 5వ వార్డులోని శ్మశాన వాటిక ప్రహరీ పనులను కౌన్సిలర్‌ సాజిద్‌అలీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కౌన్సిలర్‌ ప్రభాకర్‌ గౌడ్‌, మాజీ కౌన్సిలర్‌ జుబేర్‌ లాలా, మైనార్టీ నాయకులు ఖుర్షీద్‌ హుస్సేన్‌ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



గణేశ్‌(ఫైల్‌)

కుల్కచర్ల: కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శివ్వని గణేశ్‌(18) తాండూరు గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్‌ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పది రోజుల క్రితం అనారోగ్యంగా ఉండడంతో స్వగ్రామానికి వచ్చాడు. జూలై 31న కళాశాలకు వెళ్తానని చెప్పడంతో తల్లిదండ్రులు మహబూబ్‌నగర్‌ బస్‌ ఎక్కించారు. అదే రాత్రి మీ విద్యార్థి ఇంకా కాలేజీకి రావడం లేదంటూ ఫోన్‌ చేశారు. దీంతో తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యమవ్వలేదు. తండ్రి అంజిలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎట్టకేలకు మోక్షం

ఏడేళ్లుగా కొనసాగుతున్న వంతెన నిర్మాణం

- స్పీకర్‌ చొరవతో పెండింగ్‌ బిల్లుల విడుదల
- వేగం పుంజుకున్న పనులు



స్టేషన్‌ధారూరు–దోర్నాల్‌ మధ్య కాగ్నానదిపై నిర్మించిన పిల్లర్లపై స్లాబ్‌ వేసేందుకు అమర్చిన స్టీల్‌

ధారూరు: ఏడేళ్లుగా కొనసాగుతోన్న వంతెన నిర్మాణ పనులకు శుక్రవారం మొదటి స్లాబ్‌ పడింది. ఇన్నేళ్లుగా చేసిన పనులకు బిల్లులు అందక కాంట్రాక్టర్లు మారుతూ వచ్చారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్‌ బిల్లులను శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ చొరవతీసుకుని విడుదల చేయించడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

2016 నుంచి తప్పని తిప్పలు

మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్‌ మధ్య కాగ్నానదిపై ఉన్న పాత వంతెన నీటి ప్రవాహ ఉధృతికి 2016లో పూర్తిగా దెబ్బతింది. రాకపోలకు అవరోధంగా మారడంతో పాత వంతెనను కూల్చి డైవర్షన్‌ రోడ్డు ఏర్పాటు చేశారు. 2017లో కొత్త వంతెన నిర్మాణానికి మూడేళ్లలో పూర్తి చేసేందుకు రూ.4.70కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు అందక వంతెన నిర్మాణం కాలయాపన అయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసరంగా వెళ్లే వారు ధైర్యం చేసి నది దాటేందుకు యత్నించి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పశువులు, మేకలు, గొర్రెలు ఎన్నో మృత్యువాతపడ్డాయి.

రోడ్డు నిర్మాణానికి రూ.2.70 కోట్లు

శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ వంతెన నిర్మాణ పనులు ఆగిపోవడానికి కారణం తెలుసుకుని పెండింగ్‌ బిల్లులను విడుదల చేయించారు. 2017లో అగ్రిమెంట్‌లో ఉన్న రేట్ల ప్రకారం చేయడంతో నష్టపోవాల్సి వస్తుందని కాంట్రాక్టర్‌ వాదించినప్పటికీ స్పీకర్‌ కాంట్రాక్టర్‌కు నచ్చజెప్పి పనులు ప్రారంభించేలా చూశారు. వంతెనకు ఇరువైపుల రోడ్డు నిర్మాణానికి మరో రూ. 2.70కోట్లు నిధుల మంజూరుకు అనుమతులు చేయించారు. కాగ్నానదిలో నీటి ప్రవాహం ఉన్నప్పటికీ స్లాబ్‌ పనులు కొనసాగుతాయని ఈ నెలలో వంతెనపై సీసీ స్లాబ్‌ వేయించి రాకపోకలకు అనువుగా మారుస్తామని ఆర్‌ అండ్‌ బీ ఏఈ శ్రావణ్‌కుమార్‌ వివరించారు.

డీఎస్పీ కార్యాలయంలో భూ వివాదం

- మాజీ ఉద్యోగులు, కొనుగోలు దారుల పరస్పర ఫిర్యాదు
- సామరస్యంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచన



డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో కౌన్సిలర్‌ విజయాదేవి తదితరులు

తాండూరు: భూ ధరలు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో వివాదాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. పట్టణంలోని పాత కుంట ప్రాంతంలో స్థలాలు కొన్నవారికి, మాజీ రెవెన్యూ ఉద్యోగుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో శుక్రవారం విశ్రాంత రెవెన్యూ అధికారితో పాటు మున్సిపల్‌ కౌన్సిలర్‌ విజయాదేవి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విఠల్‌నాయక్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్‌పర్సన్‌ వీణ భర్త శ్రీనివాసచారిలతో పాటు పలువురు డీఎస్పీ కార్యాలయంలో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. తన జాగాలోకి వచ్చి హద్దు రాళ్లను ధ్వంసం చేశారని ఒకరిపై ఒకరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి చెప్పుకున్నారు. సర్వే చేయించుకోవాలని డీఎస్పీ సూచించగా.. ఇప్పటికే రెండు చేయించామని, మొదటి సర్వేలో కౌన్సిలర్‌ విజయాదేవికి భూమి వచ్చిందని, తర్వాత చేసిన సర్వేలో ఆమెకు స్థలం రాలేదని చెప్పారు. ఇరువురి వాదనలు విన్న డీఎస్పీ.. జిల్లా స్థాయి అధికారులతో సర్వే చేయించుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే రెవెన్యూ పరమైన వివాదం డీఎస్పీ కార్యాలయానికి చేరడం వెనుక ఆంతర్యమేమిటనే దానిపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

ధారూరు ఎఫ్‌ఆర్‌ఓగా రాజేందర్‌

ఐదేళ్లు ఇన్‌చార్జిల పాలనే



బి. రాజేందర్‌, ఎఫ్‌ఆర్‌ఓ

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్‌ ఆఫీసర్‌ కుర్చీ ఐదేళ్లుగా ఖాళీగానే కొనసాగుతూ వచ్చింది. ఇన్నాళ్లు ఇన్‌చార్జిలే విధులు నిర్వహించారు. శుక్రవారం ఎఫ్‌ఆర్‌ఓగా బి.రాజేందర్‌ బాధ్యతలు స్వీకరించారు. డిసెంబర్‌ 2019లో ఇక్కడ పనిచేసిన ఎఫ్‌ఆర్‌ఓ వెంకటయ్యగౌడ్‌ హైదరాబాద్‌లోని రాష్ట్ర అరణ్యకు భవన్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లగా ఆయన స్థానంలో వికారాబాద్‌ ఎఫ్‌ఆర్‌ఓ బాలయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. ఆగస్టు 2020లో ఆయన మారిపోయారు. అప్పటి నుంచి మే 2024 వరకు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓగా కృష్ణ విధులు నిర్వహించి పదవీవిరమణ పొందారు. అనంతరం వికారాబాద్‌ ఎఫ్‌ఆర్‌ఓ అరుణను ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె విధులు స్వీకరించిన తర్వాత బీడీ లీఫ్‌ నిధుల దుర్వినియోగంలో సస్పెన్షన్‌ వేటు పడింది. దీంతో పర్మినెంట్‌ ఎఫ్‌ఆర్‌ఓగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ శ్రీదేవిని 2024 జూన్‌ 3 న నియమించారు. ఆమె బాధ్యతలు చేపట్టకుండానే దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఈ రేంజ్‌ పరిధిలో అక్రమార్కులు తరుచూ ఎక్కడో ఓ చోట తరుచూ అడవిని నరికివేస్తూ పంట పొలాలుగా మారుస్తున్నారనే భయంతో ఎఫ్‌ఆర్‌ఓగా రావడానికి అంతగా ఆసక్తి చూపడం లేదనే చర్చలు లేకపోలేదు. చివరకు డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్‌ వికారాబాద్‌లో స్ట్రైకింగ్‌ ఫోర్స్‌లో రేంజర్‌గా పనిచేస్తున్న శ్యాంకుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. చివరకు నాగర్‌కర్నూల్‌ ఫారెస్టులో స్ట్రైకింగ్‌ ఫోర్స్‌ రేంజర్‌గా పనిచేస్తున్న బి.రాజేందర్‌ ధారూరుకు పర్మినెంట్‌ ఎఫ్‌ఆర్‌ఓగా విధులు చేపట్టారు.

‘స్మార్ట్‌’గా దోచేస్తారు!



సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన బుక్‌లెట్‌ చూపుతున్న డీఎస్పీ

సైబర్‌ నేరగాళ్లతో జాగ్రత్త

- మోసపోతే 1930 నంబర్‌కు ఫోన్‌ చేయండి

తాండూరు: సైబర్‌ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా స్మార్ట్‌, ఆండ్రాయిడ్‌ ఫోన్లు వినియోగిస్తున్న వారిని టార్గెట్‌గా చేసుకుంటున్న సైబర్‌ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో దోపిడీకి పాల్పడుతున్నారు. తాండూరు సబ్‌ డివిజన్‌ పరిధిలో వీటిని అరికట్టే దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 5నుంచి కుల సంఘాలు, రైతులతో పాటు అన్ని వర్గాల వారితో సమావేశాలు సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్‌ మోసాలు ఎలా చేస్తారనే అంశంపై రూపొందించిన బుక్‌లెట్‌తో అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

- ఏసీబీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, ఈడీ కార్యాలయాల నుంచి కాల్‌ చేస్తున్నామని, మీ బ్యాంకు ఖాతా పెద్ద ఎత్తున అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయని బెదిరిస్తారు. మీపై మనీలాండరింగ్‌ కేసు నమోదైంది. ఇందులో మీ ప్రమేయం ఉందో లేదో తెలుసుకోవడానికి బ్యాంకు ఖాతాను పరిశీలించాలని వీడియో కాల్‌ చేస్తారు. యూజర్‌ నేమ్‌ పాస్‌వర్డ్‌ తెలుసుకుని ఖాతాలోని నగదును మాయం చేస్తారు.
- కొరియర్‌ సర్వీస్‌ పేరిట కాల్‌ చేస్తు ఈ తరహాలో మోసాలకు పాల్పడతారు.
- దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియో కాల్‌లో విచారణ చేయదు. ఎవరు ఫోన్‌ చేసి అడిగినా మీ బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పొద్దు.
- అందమైన అమ్మాయిలు మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నిస్తారు. తెలియని అమ్మాయిలు ఎవరైనా వీడియో కాల్‌ చేస్తే వెంటనే కట్‌ చేయాలి.
- అపరిచితులు పంపించే ఫ్రెండ్‌ రిక్వెస్టులకు స్పందించొద్దు.
- ఆన్‌లైన్‌ లావాదేవీలకు ఇరుల ల్యాప్‌టాప్‌, కంప్యూటర్‌, ఉచిత వైఫై, హాట్‌స్పాట్‌ వాడకూడదు.
- క్లిష్టమైన పాస్‌వర్డ్‌ పెట్టుకోవాలి. తరచూ మార్చాలి.
- ఫోన్‌లో వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పకూడదు.
- లాటరీ తగిలిందని చెబితే నమ్మకూడదు. గిఫ్ట్‌ కూపన్లు, ఫ్రీ సర్వీసులకు మోసపోవద్దు.

= సైబర్‌ మోసాల బారినపడినా, ఎవరైనా ట్రాప్‌ చేసి బెదిరించినా వెంటనే 1930 టోల్‌ ఫ్రీ నంబర్‌కు లేదా సమీప పీఎస్‌లో ఫిర్యాదు చేయాలి.

ఆటో బోల్తా, విద్యార్థులకు గాయాలు

కుక్కను తప్పించబోయి అదుపు తప్పిన స్కూల్‌ ఆటో



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

పరిగి: కుక్కను తప్పించబోయి విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు చిన్నారులతో పాటు డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి గడిసింగాపూర్‌ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని టీచర్స్‌ కాలనీలోని మదర్స పాఠశాలలో బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. నిత్యం ఒకే ఆటో రాకపోకలు సాగిస్తుంటారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం బొంరాస్‌పేటకు వెళ్తుండగా మార్గమధ్యలో గడిసింగాపూర్‌ గ్రామం కల్లు కంపౌండ్‌ వద్ద ఆటోకు కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న 12 మంది విద్యార్థులకు గాయాలు కాగా.. వారిని అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో అబ్రన్‌, ముస్తాఫ, షాహిస్తాలతో పాటు డ్రైవర్‌ బాబయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వీరిని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ప్రాణాపాయం తప్పిందని వారి తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మండల పరిధిలోని ఖానాపూర్‌–గౌరిపల్లి శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌ చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుఇప్పపల్లికి చెందిన ఇందిరమ్మ, వెంకటయ్య భార్యాభర్తలు. వీరు శుక్రవారం ఉదయం ఆమనగల్లు నుంచి బైక్‌పై తమ స్వగ్రామమైన గట్టుఇప్పపల్లికి వస్తున్నారు. మార్గమధ్యలో ఖానాపూర్‌–గౌరిపల్లి శివారు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన దంపతులను మెరుగైన చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం



మయిన్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: ఇంట్లో నుంచి వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన మహ్మద్‌ బషీర్‌ పెద్ద కుమార్తె మయిన్‌ (15) ఏడాది నుంచి దుర్గానగర్‌లో పని నిమిత్తం శిక్షణ తీసుకుంటోంది. 20 రోజులుగా అనారోగ్యంగా ఉండడంతో ఇంటి వద్దే ఉంటోంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించిన ఆమె శుక్రవారం ఉదయం నుంచి కనిపించలేదు. ఫోన్‌ సైతం స్విచ్ఛాఫ్‌ ఉండడంతో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనుమానంతో హత్య

భార్యను కడతేర్చిన భర్త

మీర్‌పేట: అనుమానంతో ఓ వ్యక్తి భార్యను హతమార్చిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు కథనం ప్రకారం.. బొల్లారం రాజు, జ్యోతి(33) దంపతులకు ఒక ఉంది. వీరు హస్తినాపురం అగ్రికల్చర్‌ కాలనీ ఉషోదయ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా రాజు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నం సమయంలో మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు అరుచుకున్నారు. ఆగ్రహానికి గురైన రాజు ఇనుప రాడ్‌తో జ్యోతి తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి 10 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణంలోని రామమందిరంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలకంరించారు. అనంతరం లలితాసహస్రనామార్చన, ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో వికారాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ చిగుళ్లపల్లి మంజుల, ఆర్యవైశ్య సంఘం వికారాబాద్‌ అధ్యక్షుడు మాలె లక్ష్మణ్‌, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శిరీష, వికారాబాద్‌ అధ్యక్షురాలు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి సువర్ణ, కోశాధికారి మమత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకులతో వేటకు..

చితకబాదిన గ్రామస్తులు



షికారి కోసం వచ్చి దాడికి గురైన వేటగాడు

మంచాల: నాటు తుపాకీతో వేటకు వచ్చిన వారిని చితకబాదిన సంఘటన తాళ్లపల్లిగూడలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా మునుగోడు సమీపంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన కోణేటి ముత్తయ్య, రుద్రాక్ష వెంకటేశ్‌ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి బైక్‌లపై తాళ్లపల్లిగూడకు వచ్చారు. నాటు తుపాకులు(సింగిల్‌ బోరు గన్లు), తలకు బ్యాటరీ ద్వారా వచ్చే టార్చి లైట్లతో గొర్రెల కాపరులకు కనిపించారు. పొలాల్లో తిరుగుతున్న వీరిని గమనించిన గొర్రెల కాపరులు.. జీవాలను ఎత్తుకెళ్లడానికి వచ్చారనే భయంతో.. దొంగలు వచ్చారంటూ ఫోన్‌ ద్వారా స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామంలో నుంచి గుంపులుగా వచ్చిన యువకులు వారిని అడ్డుకొని చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. తుపాకులకు అనుమతులు ఉన్నాయని, వారు దొంగలు కాదు, వారు షికారి కోసం వచ్చారని సీఐ బాబ్యానాయక్‌ తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

తహసీల్దార్‌కు కిషన్‌పల్లి వాసుల ఫిర్యాదు



కిషన్‌పల్లిలో కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన భూమి

యాచారం: మాల్‌ అనుబంధ గ్రామమైన కిషన్‌పల్లిలో కబ్జాకు గురైన రూ.4 కోట్ల విలువ చేసే భూమిని కాపాడాలని స్థానికులు శుక్రవారం ఫోన్‌ ద్వారా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నాగార్జున సాగర్‌– హైదరాబాద్‌ రహదారి, మాల్‌ కేంద్రం పక్కన సర్వే నంబరు 731లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడ ఎకరా భూమి విలువ సుమారు రూ.2 కోట్లు ఉందని తెలిపారు. స్పందించిన తహసీల్దార్‌ అయ్యప్ప శనివారం ఆర్‌ఐ, సర్వేయర్‌ను పంపించి సర్వే చేయిస్తానని, ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు తేలితే స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువుతోనే గుర్తింపు

- కష్టపడి ఉన్నత శిఖరాలకు ఎదగాలి
- చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ జిల్లా అధికారి పద్మజారమణి



చౌదర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రమణి

యాచారం: సమాజంలో చదువుతోనే ప్రత్యేక గుర్తింపు వస్తుందని, పాఠశాల స్థాయి నుంచే గొప్ప లక్ష్యంతో కష్టపడి చదువాలని చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ జిల్లా అధికారి పద్మజారమణి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, చౌదర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుంటేనే వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగుంటుందని తెలిపారు. అనంతరం చౌదర్‌పల్లిలోని పాఠశాలకు చేరుకుని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట సిబ్బందికి సూచించారు. అనంతరం స్కూల్‌ ఆవరణలో మొక్కలు నాటారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

యాచారం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసీడీఎస్‌ నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పద్మజారమణి పాల్గొన్నారు. చిన్న పిల్లల మనుగడ, పోషణ, అభివృద్ధికి తల్లి పాలు కీలకమని తెలిపారు. నవజాత శిశువులను అంటువ్యాధుల నుంచి రక్షించేందుకు దివ్య ఔషధంగా పనిచేస్తా యని వివరించారు. చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంచేందుకు దోహద పడుతాయని స్పష్టంచేశారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తుండగా బలిగొన్న ఆటో

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న ట్రాలీఆటో, బైక్‌ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దామరగిద్ద బస్‌స్టేజీ సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా కోస్గి మండలం కుమ్మరికుంట తండాకు చెందిన కొర్ర నెహ్రూనాయక్‌ (38) భార్య పిల్లలతో కలిసి నగరంలోని గచ్చిబౌలిలో ఉంటూ మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామంలో పని ఉందని గురువారం సాయంత్రం బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న నెహ్రూనాయక్‌ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు వచ్చి అతడిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంసభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

మీర్‌పేట: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన దినసరి కూలీ శివయ్య(65) గత నెల 20న బాలాపూర్‌ చౌరస్తాలో నడుచుకుంటూ వెళ్తుండగా మిధాని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందాడు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌: ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షాద్‌నగర్‌ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్‌ వి.లక్ష్మణ్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్‌ ఆఫ్‌ ఎంప్లాయిమెంట్‌ అండ్‌ ట్రైనింగ్‌ డిపార్టుమెంట్‌ వారు మూడో విడతలో భాగంగా అప్లికేషన్లు కోరుతున్నామని పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్‌ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.